# ఆలోచించి పరిహసించు

కె. మధుసూదన్



"నేనొక వివాహానికి వెళ్లాను. నాముందు. వరుసలో కూర్చున్నవారు నవ దంపతులు కాబోలు! భర్త భార్యను ఏదో పరిహసించడం, భార్య వెంటనే ముఖం చిన్నబుచ్చుకొని విసవిసలాడుతూ బయటికెళ్ళడం,, ఆవిడ వెనకాలే సదరు భర్తగారు వెళ్లడం క్షణాల్లో జరిగాయి.

ఇంతకు ఆవిడ భర్తగారు ఏవిధమైన పరిహాసాలాడారు, ఆ పరిహాసం ఆవిడను అంతగా బాధించిందా? ఔను తప్పక ఆమెను ఆ పరిహాసం బాధించే ఉంటుంది. లేకుంటే పెళ్లి ఐనా చూడకుండా అలా బయటికి ఎందుకు వెళుతుంది?

ఆనాడు నేను సురేఖను దూరదృష్టి లేకుండా పరిహాసాలాడిన ఫలితంగా! అమూల్యమైన నా జీవితాన్ని కోల్పోవలసివచ్చింది. ఆ వైనం తలచుకోగానే నాలుగు సంవత్సరాల గతం సినిమా రీళ్ళలాగా నా కళ్లముందు మెదిలింది.

⁂ ⁂ ⁂

అప్పుడు నేను హైదరాబాద్‌లో ఎమ్మే చదువుతుండేవాణ్ని. సినిమాల పిచ్చి బాగా ఉండేది. ఏదైనా మంచి సినిమా వచ్చిందంటే వదిలేవాణ్ని కాదు. ఏదో మంచి సినిమా వచ్చిందని! అది నేటితో ఆఖరని తెలియడంతో థియేటర్ వద్ద కెళ్లాను. నేను వెళ్లేసరికి హౌస్‌ఫుల్ బోర్డ్ వ్రేలాడుతూ కనిపించింది.

ఇక చేసేది లేక కొంతసేపు అలాగే నిలబడ్డాను. ఆట మొదలవుతున్నట్లుగా బెల్ మ్రోగింది. మరో ఐదు నిముషాలు అలాగే నిల్చుని, ఇక చేసేది లేక నిరాశతో వెనుతిరుగుతుండగా "మధుసూదన్‌గారూ

నమస్తే" అన్న కోమల కంఠస్వరం వినబడింది. ఆ స్వరం వినబడిన వైపు తిరిగి చూచాను. ఆ యువతి సరాసరి నా వద్ద కొచ్చింది.

సుమారు ఇరవై సంవత్సరాల యువతి నా వద్దకు రావడంతో! "మీరు?" సంశయంతో అడిగాను. దానికామె

"మీరు నాకు తెలుసునండి. మీ రచనలు వివిధ పత్రికల్లో చదివాను. మీ ఫోటో గూఢా రెండు మూడు సార్లు పత్రికల్లో చూడడం జరిగింది.

మీ సీరియల్ తెగిన వీణ చదువుతున్నాను. ఆ సీరియల్ ప్రారంభంలో మీ ఫోటో వివరాలు ఉండడంతో మీరేనని గుర్తించి, టికెట్ దొరకక మీరు తిరిగి వెళ్లడంతో! నా వద్ద నున్న ఎక్స్ట్రా టికెట్ మీకిద్దామని పిలిచాను" అని ఆమె అనడంతో, కృతజ్ఞతలు తెలుపుతూ డబ్బు చెల్లించి టికెట్ తీసుకున్నాను. సినిమా ప్రారంభం కానున్నట్లుగా బెల్ మ్రోగడంతో హాల్లోకి నడిచాను. ఆమె హాల్లోకి ప్రవేశిస్తూ "మా ఫ్రెండ్ కొరకు టికెట్ కొన్నానండి. అది ఎందుచేతనో రాలేదు" అంది.

"ఏదో అర్జంటు పని తగలడంతో రావడానికి వీలుపడకపోవచ్చు" అన్నాను.

ఔనన్నట్లుగా ఆమె తలాడించింది. మౌనంగా సినిమా చూడసాగాము.

విశ్రాంతి సమయంలో నా కథల గురించి పత్రికలో వస్తున్న నా సీరియల్ గురించి ప్రస్తావించసాగింది. తిరిగి సినిమా ప్రారంభమవడంతో దానిలో నిమగ్నులైనాము.

సినిమా పూర్తైన తర్వాత టికెట్ ఇచ్చినందుకు తిరిగి కృతజ్ఞతలు తెలుపుతూ! ఎవరిళ్లకు వాళ్లం బయలుదేరాము. నెల రోజుల తరువాత ఆమె నాకు అనుకోకుండా రవీంద్రభారతిలో కనిపించింది. ఓ రోజు అక్కడ సాహిత్య చర్చల ఉండడంతో! పైగా నా చర్చ గూడా ఉండడంతో వెళ్లక తప్పింది కాదు.

ఈసారి ఆమె నాతో కొంత ఫ్రీగా మాట్లాడసాగింది. బి.ఎ చదువుతున్నానని. నాన్నగారు టీచర్‌గా పనిచేసి ఈ మధ్యనే రిటైరయ్యారని తన పేరు సురేఖని ఉన్న ఒక్క అన్నయ్యకు ఈ మధ్యనే ఉద్యోగం దొరికిందని చెప్పింది. చాలాసేపు ఆమెతో గడపడంతో ఒకరంటే ఒకరికి ప్రత్యేక ఆకర్షణ ఏర్పడింది. ఆ ఆకర్షణ ప్రేమలోకి దిగటానికి ఎంతోకాలం పట్టలేదు. వీలున్నపుడు, వీలుపడ్డచోట్లలో కలిసేవాళ్లం. కేవలం కలిసే వాళ్లమే కాదు సినిమాలకు షికార్లకు గూడా తిరిగేవాళ్లం. మా

## ముద్దులు

తొలి దిక్కు సుదతికి
సూర్యతిలకము దిద్ద
మేల్కొన్న జగతికి
మొగసాల రుచి ముద్దు
మంచు చినుకులు తూలి
మందారముల పైన
తందరించిన చోట
తొగరు విరుపుల ముద్దు
జలతారు కెరటాల
లలి పెదవులను మీటి
తటి మీద పదములను
తాక తరగల ముద్దు
అంచపదముల సాగు
అడుగులకు మడుగొత్తి
కందిపోయిన మొలక
గరిక పచ్చని ముద్దు
విరిబాల కొమ్మలకు
విరిసి పూవుల గుత్తి
పుప్పొడులు వెదజల్లు
పులక విచ్చిన ముద్దు

- సాంధ్యశ్రీ

ప్రేమ పుష్పించి ఫలంగా మారింది.

కాలగర్భంలో రెండు నెలలు గడిచిపోయాయి. ఈ రెండు నెల్ల కాలంలో మా బంధం మరింత విడదీయని అనుబంధంగా మారింది.

మా అమ్మా నాన్నకు నేనొక్కణ్ణే మగ సంతానం. నేనంటే వారికి పంచప్రాణాలు. ఎటువంటి పరిస్థితిలోను వారు నా మాట కాదనరు. నాకు నమ్మకముంది. అందుకే సమయం చూచి సురేఖ విషయం ప్రస్తావించాలనుకున్నాను.

ఒకనాటి ఉదయం నా చెల్లెలు తన ఫ్రెండ్‌తో ఏదో పరిహాసాలాడడం, ఆ ఫ్రెండ్ సీరియస్‌గా ముఖమంతా మాడ్చుకొని విసవిసలాడుతూ బయటికెళ్లింది.

అప్పుడే నాకు మెరుపులాంటి ఆలోచన వచ్చింది. ఆ ఆలోచనే పరిహాసంగా సురేఖపై ప్రయోగించి ఆమె ముఖంలో కలిగే ముఖ కవళికలను చూడాలని పిచ్చి కోరిక కల్గింది. సాయంత్రం మవడంతోనే స్కూటర్ తీసుకొని పార్క్‌లోకి వెళ్లాను. స్కూటర్ పార్క్ చేసి పార్క్‌లోకి వెళ్లాను. అప్పటికే సురేఖ నాకొరకు ఎదురుచూస్తోంది.

నేను లేని విచారం వ్యక్తపరుస్తూ! ఆమె ముందు ప్రత్యక్షమయ్యాను. నా ముఖకవళికలు గమనిస్తూ! "మధూ అలా ఉన్నావ్ ఏం జరిగింది" అని ఆందోళనగా ప్రశ్నించింది.

దానికి నేను ఎంతో విచారం వ్యక్తపరుస్తూ "సురేఖా అనుకోనివిధంగా నా వివాహం నిశ్చయమైంది. నేను ఎంతగా వారిస్తున్నా వినకుండా చావుబ్రతుకుల మధ్య ఉన్న మా బామ్మగారి కోరికపై ఈ వివాహాన్ని వారే నిశ్చయించారు.

వారి నిశ్చయానికి తలవంచక తప్పింది కాదు. నన్ను క్షమించు" అన్నాను ఆమె ముఖకవళికలు గమనిస్తూ!

నేను ఊహించినవిధంగానే ఆమె ముఖంలో మార్పు స్పష్టంగా కనిపించింది. ఆమె ముఖం విషాదవదనమైంది. ఆమె కన్నుల్లో నీళ్లు తిరగడం స్పష్టంగా గమనించాను. నేను ఊహించిన స్పందన ఆమెలో కనిపించింది.

మరోసారి ఆమెకు సారీ చెపుతూ వెళ్లి వస్తానంటూ పార్క్ బయటనున్న స్కూటర్ స్టార్ట్ చేస్తూ స్కూటర్ పై వెళ్ళతూ ఇలా అనుకున్నాను.

రేపు ఉదయం సురేఖను కాలేజీలో కలుసుకొని ఇదంతా పచ్చి అబద్ధమని వట్టి పరిహాసానికి అన్న మాటలని, అలా పరిహాసాలాడితే నీలో కలిగే ఫీలింగ్ చూద్దామని అలా పరిహాసాలాడానని, ఆడినందుకు క్షమించమని నిన్ను తప్ప మరెవ్వరిని వివాహమాడనని ఇది నగ్న సత్యమని నిన్ను అమితంగా బాధపెట్టినందుకు క్షమించమని అడగాలని రేపే ఆ పని చేయాలని ఆలోచిస్తూ ఆలోచనల మధ్య వేగంగా స్కూటర్ పోనిస్తూ ఆక్సిడెంట్‌కు గురై మూడు నెలలు హాస్పిటల్లో ఉన్నాను. ఈ మూడు నెలల కాలంలో సురేఖను పూర్తిగా మరిచిపోయాను. కారణం ఏక్సిడెంటే నన్ను మరిచేలా చేసింది. ఆ తర్వాత సురేఖ ఇంటికెళ్ళి వాకబు చేస్తే! తండ్రి గుండెపోటుతో మరణించడంతో వాళ్ళ అన్నయ్య తీసికెళ్లాడని అతడు ఏ ఊరు వెళ్లాడో వాళ్ళు ఎక్కడ ఉంటున్నారో ఎవరికి తెలియదన్నారు.

ఆనాటి నుండి ఈనాటి వరకు సురేఖ కొరకు గాలిస్తూనే ఉన్నాను. కానీ ఏం లాభం? ఎంతగా గాలించినా నా సురేఖ నాకు కనిపించలేదు. ఆనాడు నేను అనాలోచితంగా చేసిన పరిహాసం ఇంతగా వికటిస్తుందని కలలో గూడా ఊహించలేదు. అందుకే అంటాను! ఎవ్వరికైనా పరిహసించే ముందు బాగా ఆలోచించు కోవాలని. ఆలోచించి పరిహసించాలని. ❋